# ఓటరుగా నమోదు ఎన్నికల ప్రక్రియలో యువత చురుకైన పాత్ర పోషించాలి:రాష్ట్ర గవర్నర్

అమరావతి,25 జనవరి:దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణలో భాగంగా ఓటరుగా నమోదు ఎన్నికల ప్రక్రియలో నేటి యువత క్రియాశీలకమైన పాత్ర పోషించాలని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పిలుపు నిచ్చారు.మంగళవారం 12వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి సచివాలయం ఐదవ బ్లాకు కలక్టర్ల సమావేశ మందిరంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ విజయవాడ రాజ్ భవన్ నుండి ఆన్లైన్ వెబ్ నార్ ద్వారా పాల్గొన్నారు.తొలుత రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కె.విజయానంద్ కార్యక్రమానికి స్వాగతం పలకగా కార్యక్రమంలో పాల్గొన్న అందరితో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు.ఈసందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రస్తుత కరోణా పరిస్థితులు కారణంగా ఈవేడుకలకు నేరుగా పాల్గోలేక పోతున్నానని పేర్కొన్నారు.1950లో భారత ఎన్నికల సంఘం ఏర్పాటు కాగా 2011 నుండి జనవరి 25తేదీన దేశవ్యాప్తంగా ప్రతి ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు.ఓటురుగా నమోదుకు అర్హత కలిగి ఉన్న వారందరినీ ఓటర్లుగా నమోదు చేసేందుకు గత దశాబ్ద కాలంగా స్వీప్(SVEEP)(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్)కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ఓటర్లను పెద్దఎత్తున ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకు భారత ఎన్నికల సంఘం చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.ముఖ్యంగా ఓటరుగా నమోదు ఎన్నికల ప్రక్రియలో యువత చురుగ్గా పాల్గొనాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గవర్నర్ హరిచందన్ ఈసందర్భంగా ప్రత్యేకంగా పేర్కొన్నారు.మన రాజ్యాంగం కుల,మతాలు,వర్గాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమానంగా ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాలను కల్పించిందని చెప్పారు.కావున ప్రతి ఒక్కరూ వారి ఓటుహక్కును వినియోగించు కోవాల్సిన

బాధ్యత వారిపై ఉందన్నారు.ఓటరు అవగాహనా కార్యక్రమాలను గురించి ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగం ఆవశ్యకతపై భవిష్యత్తు ఓటర్లలో మరింత విస్తృత అవగాహనకు ఎన్నికలు,ఓటు అనేవి పాఠ్యాంశాల్లో ఒక భాగంగా చేర్చాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చెప్పారు.

ప్రజలు వారికి నచ్చిన ప్రజా ప్రతినిధిని ఎన్నుకునేందుకు వారి చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కుఅని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ స్పష్టం చేశారు.కావున ప్రతి అర్హతగల ప్రతి పౌరుడు బాధ్యతగా ఓటరుగా పేరు నమోదు చేసుకుని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై తనకు నచ్చిన వ్యక్తిని ప్రజాప్రతినిధుగా ఎన్నుకోవాలని సూచించారు.అందుకే ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించేందుకు భారత ఎన్నికల సంఘం కృషి చేస్తోందని తెలిపారు.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వవస్థగా భారతదేశం ఉన్నందుకు మనమంతా గర్వించాల్సిన విషయమని రాష్ట్ర గవర్నర్ పేర్కొన్నారు.భారత ఎన్నికల సంఘం ఓటరుగా పేరు నమోదు ప్రక్రియను మరింత పారదర్శకత,సులభతరం చేసేందుకు అనేక రకాల వినూత్న చర్యలను చేపట్టడం పట్ల గవర్నర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు.ముఖ్యంగా ఆధార్ తో ఫొటో ఓటరు గుర్తింపు కార్డు(EPIC)ను అనుసంధానించడంతో ఓటరుగా పేరు నమోదు ప్రక్రియను సులభతరం చేయడం తోపాటు రెండు సార్లు పేర్లు నమోదు కాకుండా నివారించేందుకు అవకాశం కలిగిందని తెలిపారు.అదే విధంగా నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్,ఓటర్ హెల్ప్ లైన్ మొబైల్ యాప్,సెంట్రలైజ్డ్ యూనిక్ డేటాబేస్ సిస్టమ్,సువిధ పోర్టల్,సి-విజిల్ మొబైల్ యాప్,పిడబ్ల్యుడి మొబైల్ యాప్,1950 యూనిక్ నంబరుతో కూడిన కాల్ సెంటర్ ఏర్పాటు వంటి పలు వెబ్ బేస్డ్ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈనెల 5వతేదీ నాటికి 4కోట్ల 7లక్షల మంది ఓటర్లుగా నమోదు అయ్యేందుకు నిర్వహించిన విస్తృత ప్రచార అవగాహనా కార్యక్రమాల్లో భాగస్వాములైన వివిధ రాజకీయ పార్టీలు,స్వచ్ఛంధ సంస్థలు,వివిధ విద్యాసంస్థలు తదితర అందరికీ గవర్నర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్లైన్ వెబ్ నార్ ద్వారా ఈకార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.సమీర్ శర్మ మాట్లాడుతూ దేశం గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్న సమయంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలను కూడా నిర్వహించుకోడం ఆనందదాయకం అని పేర్కొన్నారు.ఓటర్లలో 50శాతం మంది యువత భాగస్వాలుగా ఉండడం అభినందనీయ మని పేర్కొన్నారు.రాష్ట్రంలో ఓటరుగా నమోదుకు అర్హత గల ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు పెద్దఎత్తున ఓటరు అవగాహన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా వివిధ విద్యాసంస్థల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్లు ఏర్పాటు చేయడం ద్వారా అర్హత గల వారందరికీ అవగాహన కల్పించి ఓటర్లుగా నమోదు చేశారని అన్నారు.

ఈ12వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమానికి తొలుత రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సిఇఓ)కె.విజయానంద్ స్వాగతోపన్యాసం చేస్తూ భారత ఎన్నికల సంఘం వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా ప్రతి యేటా జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్నిగత 2011 నుండి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర,జిల్లా, డివిజన్,సబ్ డివిజన్,పోలింగ్ కేంద్రాలు సహా మొత్తం 45వేల 950 ప్రాంతాల్లో ఈవేడుకలను నిర్వహించడం జరుగుతోందని చెప్పారు.ముఖ్యంగా ఓటు హక్కు అర్హత కలిగిన ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించి వారిని ఓటర్లుగా నమోదు చేయడం తోపాటు వారిని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యే విధంగా వారిలో చైతన్యాన్ని కలగించే లక్ష్యంతో జాతీయ ఓటరు దినోత్సవ

వేడుకలను నిర్వహించడం జరగుతోందన్నారు.ఈఏడాది జాతీయ ఓటరు దినోత్సవాన్ని "మేకింగ్ ఎలక్షన్స్ ఇన్ క్లూజివ్,యాక్సిసబుల్ అండ్ పార్టీసపేటరీ"అనే థీంతో నిర్వహిస్తున్నట్టు సిఇఓ విజయానంద్ పేర్కొన్నారు.

తదుపరి జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా భారత ప్రధాన ఎన్నికల కమీషనర్ సుశీల్ చంద్ర పంపిన వీడియో సందేశాన్ని ఈసమావేశంలో ప్రదర్శించారు.

అనంతరం ఓటర్ల నమోదు,ఎన్నికల నిర్వహణ మరియు పోలింగ్ కేంద్రం స్థాయి నుండి జిల్లా కేంద్ర స్థాయి వరకూ ఈరోనెట్ నిర్వహణ వంటి రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన పశ్చిమ గోదావరి,విజయనగరం,అనంతపురం జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులైన కలక్టర్లు కార్తికేయ మిశ్రా,ఎ.సూర్యకుమారి,నాగలక్ష్మి మరియు తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన నెల్లూరు జిల్లా ఎన్నికల అధికారి కలక్టర్ కెవిఎన్ చక్రధర బాబు లకు సిఇఓ విజయానంద్ ప్రశంసా పత్రాలను,జ్ణాపికలను అందించారు.అలాగే కడప జిల్లా బద్వేలు అసెంబ్లీ ఉప ఎన్నికలు నిర్వహించిన రిటర్నింగ్ అధికారైన కడప జిల్లా రాజంపేట సబ్ కలక్టర్ కేతన్ గార్గ్,రాష్ట్ర విధానపరిషత్ ద్వైవార్షిక ఎన్నికలు నిర్వహించిన రిటర్నింగ్ అధికారి పివి సుబ్బారెడ్డికి ప్రశంసా పత్రాన్ని,జ్ణాపికను అందించారు.అదే విధంగా జిల్లాకు ఒకరు వంతున 13మంది ఇఆర్ఓ(ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి)లకు,మరో 13మంది ఎఇఆర్ఓలకు, మరో 13మంది బూత్ స్థాయి అధికారులకు,సచివాలయంలోని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు సెక్షన్ అధికారులు,విజయనగరం,ప్రకాశం జిల్లాలకు చెందిన ఇద్దరు ఎస్ఎల్ఏ టీం సిబ్బందికి ప్రశంసా పత్రాలను,జ్ణాపికలను సిఇఓ విజయానంద అందించారు.

(ప్రచార విభాగం సమాచారశాఖ అమరావతి సచివాలయం వారిచే జారీ చేయడమైనది)